
# సినీ బేతాళ కథలు





**– డా. కె.వివేకానందమూర్తి**

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 20 -

### - దుక్కరసం -

విక్రమార్కుడు పట్టువదలకుండా మళ్ళీ బేతాళుడిని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

"విక్రమార్కా! నీకు శ్రమ కలుగకుండా వుండేందుకు మళ్ళీ మరో కథ చెబుతాను విను" - అని బేతాళుడు ప్రారంభించాడు. "గుక్కనాథం అనే తెలుగు నిర్మాత వున్నాడు. అతను అనేక సినిమాలు తీశాడు. అతని సినిమాల్లో అన్ని రసాలు వుండేవి. కొన్ని చిత్రాల్లో నీరసం కూడా వుండేది. అయితే అతనికి దుఃఖరసం అంటే బాగా యిష్టం. సినేమాలో దుక్కరసం ముక్కెవయ్యా అని రచయితలనూ, దర్శకులనూ వొత్తిడి చేసేవాడు. అంచేత అతన్ని అంతా దుక్కరసం గుక్కనాథం అని పిలిచేవారు. గుక్కనాధానికి దుక్కరసంతో బాటు గుక్కరసం కూడా ఎక్కువ యిష్టం. సూరీడు పక్కెక్కగానే అతనికి గుక్క పడిపోవాలిసిందే. చుక్కలు పొడవగానే గుక్కలు, గుక్కలు గుక్కలుగా గొంతు తడిపేసుకునేవాడు. గుక్కలెక్కువయ్యాక రచయితను పిలిచి గుక్క తిరక్కుండా పెక్కు కథలు కైపెక్కేదాకా చెప్పేవాడు. ఆ కథలు విన్నాక రచయిత గుక్క తిరక్కుండా ఏడుస్తూ యింటికి వెళ్లిపోయేవాడు.

అయినా పట్టువదలని నీలా అంటే పట్టువదలని విక్రమార్కుడిలా, గుక్కనాథం తనిష్టపడే దుక్కరసాన్ని గుప్పించి, ప్రేక్షకులను ఏడిపించి బాగా సంపాదించి బాగా తినేవాడు. తిన్నదీ, తాగిందీ కలిసి దుక్కనాధం దుక్కలా అయిపోయి దుక్క నిర్మాతగా పేరు తెచ్చుకున్నాడు.

దుక్కనాధానికి, చొక్కా పంతులు అని వొక చిన్ననాటి మిత్రుడున్నాడు. చొక్కా పంతులు కూడా సినిమాల్లో చేరాడు. కానీ చొక్కా పంతులుకి వొక్క హీరో వేషం కూడా రాలేదు. అన్నీ చిన్నా చితక వేషాలే. అయినా దుక్కనాధానికీ, చొక్కా పంతులుకీ స్నేహ బంధంలో తేడా రాలేదు. చిన్ననాటినుంచే యిద్దరూ వొకే రూములో వుంటూ, ఒకే కంచంలో తింటూ, కంచం విశాలంగా వుండడంవల్ల గుక్క చొక్కాలకు పక్కేలా, అని పాడుకుంటూ ఖాళీ అయిన ఆ కంచంలోనే పడుకుని నిద్రపోయేవారు. దుక్కనాధం, చొక్కా పంతులు

ప్రాణమిత్రులు. దుక్క గుటకలా, పక్క చుక్కలా, రెక్క ఈకలా వొక్కగా కలిసుండేవారు. కానీ అనుకోకుండా వారిద్దరూ అర్జంటుగా తామే దుక్కరసానికి దాసులైపోయారు.

ఓసారి అప్పటి వాహినీలో ఒక ఫ్లోర్‌లో షూటింగు జరుగుతోంది. పౌరాణిక చిత్రం. వాలి సుగ్రీవుల కథ. సుగ్రీవ పాత్రధారి మేకప్ వేసుకోగానే డానీ లూయిస్‌లా (డానీ అయితే పాత్ర వొప్పుకోగానే పాత్రలో ప్రవేశించేస్తాడు) పాత్రలో లీనమై పోయాడు. శ్రీరామా గమనానందంతో తన్మయుడై ఫ్లోరంతా గంతులు వేశాడు. అట్టకొండకి సొట్టలు పడ్డాయి. ప్లాస్టిక్ ఆకులు సగం పైగా తినేశాడు. వానర వన సంపద వానలు పడని కోనలా తయారైంది. ఇంకా కెమెరా ట్రాలీ యెక్కి వూగాడు. అదుపు తప్పి ట్రాలీ కిందపడింది. కెమెరామెన్ మెడలా అయిపోయింది. నిర్మాత బర్మావాడు. బర్మాలో యెన్ని బూతులు తిట్టినా యెవరికీ అర్థం కాలేదు. – మన తెలుగే చెట్టెక్కేసింది. ఇహ బర్మావొకటి మన ప్రాణానికి – అని నటులూ, క్రూ అంతా గుసలు కొట్టారు.

ఫ్లోర్‌లో  బాగా వేడిగా వుంది మనకెందుకు యీ గొడవ అని చాలామంది ఆర్టిస్టులు ఫ్లోర్ బైటికొచ్చి కుర్చీల్లో కూర్చుని ప్రొడక్షన్ పకోడీలు వడలు మేయసాగారు. కొన్ని కోతి వేషధారులు పేకాట పరిచారు. మరికొన్ని వానరాలు సిగరెట్లు వెలిగించారు. "స్టూడియో తగలెట్టేస్తార్రా కోతి పీనుగుల్లారా" అని ప్రొడక్షన్ మేనేజరు కోప్పడినా, చెవులన్నీ మేకప్‌తో, విగ్గులతో మూసుకుపోయి ఎవరికీ వినబడలేదు. ఎవరి గొడవలో వారున్నారు.

అదే టైముకి దుక్కనాథం వొళ్ళు తగ్గించుకోడానికి వాహినీలో వాకుతున్నాడు.

పౌరాణికం తీసే గందరగోళ చిత్రంలో చొక్కా పంతులు కూడా ఓ వేషం వేస్తున్నాడు. తను కూడా ఫ్లోర్ బైట కూర్చుని, ఆ దారిలో వాకుతున్న దుక్కనాధాన్ని పలకరించాడు. దుక్కనాథం, చొక్కా పంతుల్ని చూశాడుగానీ చొక్కుడి పలకరింపుకి స్పందించలేదు. తన మానాన తన నడకలో సాగిపోయాడు. చొక్కా పంతులు చాలా అప్‌సెట్ అయి మళ్ళీ ఆ సెట్‌లోకి పోలేదు. ప్రాణాధికమైన మిత్రుడు దుక్కనాథం వైఖరికి చొక్కా పంతులుకి లెక్కలేనంత దుఃఖం వచ్చింది. దుఃఖబాధ భరించలేక తనకున్న వొక్క చొక్కా చింపేసుకుని చింపిరి చొక్కా పంతులైపోయాడు. అంతే ఆరోజు నుండీ అతను దుక్క నిర్మాతను కలవలేదు. "ఈ మాత్తరం యేసానికే యీడికింత పొగరొచ్చేసి నట్టుంది. ఏ కారణం లేకుండా చొక్కా పంతులు ఎందుకు దూరమైపోయాడో!? " దుక్కనాథం యెంత థింకినా దిక్కుతోచలేదు. రోజులు, నెలలూ గడిచాయి, వారిద్దరి మధ్య తెలుగు చిత్రానికి, తెలుగుకీ దూరంలా దూరం వీర పెరుగుడు పెరిగింది.

– ఇప్పుడు చెప్పు విక్రా! యిలా యెందుకు జరిగింది. బాపూరమణల్లా, శంకరజైకిషన్‌లా, అయిటమ్ పిల్లకు అతుక్కుపోయిన అండర్ వేర్‌లా కలయికకు నిర్వచనం అనదగ్గ దుక్కనాథం,  చొక్కా పంతుల్ని చూసే పలకరించకుండా యెందుకలా వెళ్లిపోయాడు? – నువ్వీ అపార్థానికి అర్థమైన జవాబు చెప్పకపోతే నీ తల దుక్కనాథం బాడీలా వాచిపోతుంది –" అని బేతాళుడు ముగించాడు.

అందుకు సమాధానంగా – "ఓ బేతాళా! దీనికంతటికీ కారణం ఆ బర్మా కిరసనాయిలు నిర్మాత. కిరసనాయిలు బిజినెస్‌లో బాగా గడించి, సౌతిండియా సినిమాలకు సౌండ్ ప్రాఫిట్ డిఫినిట్ అని యెవరో చెబితే విని వాహినిలో వాలీ సుగ్రీవుల చిత్రనిర్మాణం చేపట్టాడు. కథానుగుణంగా వానరపాత్రలు విరివిగా నిండి చొక్కా పంతులు కూడా వానర పాత్ర ధరించి, మేకప్‌తో ఫ్లోర్ బైటకూచున్నప్పుడు ఆప్తమిత్రుడు దుక్కనాధాన్ని పలకరిస్తే అతను రెస్పాండవకుండా వెళ్లిపోయాడు. కారణం చొక్కా పంతులకి కోతిమూతి, – వాలికీ, సుగ్రీవుడికీ, అంగదుడికీ, శ్రీ ఆంజనేయులవారికి, వానరసేనకూ టోకున ఒకేరకం మూతులు చైనా నుంచి ఆర్డర్ చేసి తెప్పించారు. ఆ నట వానరాల్లో అంతా వొకేలా అగుపించి, దుక్కనాథం చొక్కా పంతుల్ని గుర్తించలేదు. ఎవరో జూనియర్ ఆర్టిస్టు వేషార్థ పలకరింపనుకున్నాడు.

– దేహాలలో తేడాలున్నా జీవులలో తేడా లేదు.

టేకింగ్‌లో తేడాలున్నా కథ వస్తువొకటే.

'దేహీ నిత్యమవధ్యోయం

దేహే సర్వస్యభారత!

తస్మాత్సర్వాణిభూతాని

నత్వం శోచితు మర్హసి'

- అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు-"

అని విక్రమార్కుడు సమాధానం చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు తన ముఖం తడుముకుంటూ ఎగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments